క్లుప్తంగా

వాహనాల తనిఖీ

అట్లూరు : మండల పరిధిలోని కడప – బద్వేలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించి జరిమానా విధించినట్లు బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు తెలిపారు. శనివారం సాయంత్రం రికార్డులు సక్రమంగా లేని 6 వాహనాలకు రూ.30 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన డ్రైవర్లతో మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని, ఈ విషయాన్ని డ్రైవర్లు గుర్తించాలని, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

బద్వేలు అర్బన్ : చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజ, వ్యవసాయ కమిషనర్ కార్యాలయ పరిశీలకులు బి.వి.సురేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బోవిళ్ళవారిపల్లె గ్రామంలో చిరుధాన్యాల సాగు, వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి ఓబయ్య, జెడ్‌బీఎన్ఎఫ్ డివిజనల్ యాంకర్ నాగసుబ్బరాయుడు, వ్యవసాయ గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వైద్య శిబిరం నిర్వహించి మధ్యాహ్నం నుంచి ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక రోగులను పరిశీలించి వారికి అవసరమైన వైద్యం అందించి, మందులు ఇవ్వటం జరుగుతుందని ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

మూఢనమ్మకాలు వదలడం లేదు



సన్నివేశాలను చిత్రీకరిస్తున్న దృశ్యం

బి.కోడూరు : హైటెక్ యుగంలో కూడా మూఢనమ్మకాలు వదలడం లేదని జబర్దస్త్ టీమ్ లీడర్లు గడ్డం నవీన్, చిట్టిబాబు, డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. సమాజంలో మార్పులు తీసుకొచ్చేందుకే మసకమసక చీకటిలో అన్న టైటిల్‌తో సినిమాను తీస్తున్నామన్నారు. బి.కోడూరు మండలంలోని కోడూరు దుర్గమ్మ, చెన్నకేశవస్వామి, నరసయ్యస్వామి ఆలయాల పరిసర ప్రాంతాలు, బంగారు కొండపై శ్రీమల్లికార్జున క్రియేషన్స్ ప్రొడక్షన్ బ్యానర్‌పై మసకమసక చీకటిలో అన్న టైటిల్‌తో సినిమా షూటింగ్ చిత్రీకరణ జరుపుతున్నామని తెలిపారు. ఇందులో హీరోలు అల్లుదీపక్, హరీష్, నగేష్, హీరోయిన్లు నీలిమా, తన్వీ, మధు, జబర్దస్త్ టీమ్ గడ్డం నవీన్, చిట్టిబాబుల కామిడీ, థ్రిల్లింగ్ సూపర్‌గా ఉంటుందని డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



సన్మాన గ్రహీతలతో అధ్యాపకులు, ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల: చక్కని పనితీరు కనపరచి ప్రభుత్వ అవార్డు పొందిన వారిని శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డి సన్మానించారు. గణతంత్ర దినోత్సవం రోజు కలెక్టర్ ద్వారా అవార్డు అందుకున్న సర్వశిక్షా పథక సంచాలకులు ప్రభాకర్ రెడ్డి, యస్‌యస్ఏ కో ఆర్డినేటర్ దశరధరామిరెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గానుగపెంట రమణారెడ్డిని సన్మానించారు.

మూగ జంతువులను ప్రేమగా చూసుకోవాలి

రాజుపాళెం: మూగ జంతువులను ప్రతిఒక్కరూ ప్రేమగా చూసుకోవాలని గాదెగూడూరు పశువైద్యాధికారి ప్రదీప్‌రెడ్డి అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా మండలంలోని గాదెగూడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ అశోక్, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ ఆరీఫ్ పాల్గొన్నారు.
కొర్రపాడులో.. కొర్రపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు జంతు సంరక్షణ పక్షోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొర్రపాడు పశువైద్యాధికారిణి టి.లక్ష్మీదేవి, హెచ్‌ఎం పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున చెన్నకేశవ స్వామికి, మహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం, గో క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులకు సూర్యకిరణాలను తాకిన అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవం చేశారు. ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా రూపొందించిన వాహనంపై కొలువు దీర్చారు. సాయంత్రం పురవీధుల్లో గోవింద నామ స్మరణల మధ్య శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవ స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు వైభవంగా చేశారు. ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆత్మారామస్వామి ఆలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను పురవీధుల్లో మంగళవాయిద్యాలతో ఊరేగించారు. స్థానిక రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన నిర్వహించారు.

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పలు ఆలయాలలో శనివారం రథసప్తమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన రథసప్తమి వేడుకల్లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక



ప్రత్యేక అలంకరణలో రతనాల వేంకటేశ్వరుడు, అశ్వవాహనంపై శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవుడు

పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సూర్యప్రభ వాహనం, శేష వాహనం, గరుడ వాహనం, హనుమంతు వాహనం, చంద్రప్రభ వాహన సేవలలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. లక్ష్మిపాళెం గ్రామంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫైర్ స్టేషన్ వెనుకభాగంలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి అభిషేకం చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు కె.రాజేశ్వరి, కె.రమణారెడ్డి, ఆలయ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాశినాయన : మండల ప్రజలు శనివారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నరసాపురం చెన్నకేశవస్వామి దేవాలయంలో రథసప్తమిని పురస్కరించుకుని చెన్నకేశవస్వామిని గ్రామోత్సవం నిర్వహించారు.



గరుడ వాహన సేవలో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు వచ్చి స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



గోపవరం : ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

వైభవంగా ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి, పాల్గొన్న భక్తులు

ప్రొద్దుటూరు : మండలంలోని తాళ్లమాపురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ 7వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్వాముల వారికి ఉదయం పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 10.50 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వేద పండితులు కేటీ వెంకటాచల శర్మ, సుబ్బరామయ్యశర్మ, పిడతల పవన్‌కుమార్ శర్మ వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఉప సర్పంచ్ మాచిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ మాచిరెడ్డి చిన్న కొండారెడ్డి, ఈఓ రమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

ప్రొద్దుటూరు క్రైం : ఫిబ్రవరి 11న నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్. హారిక తెలిపారు. కోర్టుహాల్‌లో శనివారం పట్టణంలోని పోలీసు అధికారులతో మెజిస్ట్రేట్ చర్చించారు. క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులు, చిన్న చిన్న తగాదాల కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు పోలీసులు సహకరించాలని మెజిస్ట్రేట్ సూచించారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని వివరించారు. ఒక సారి రాజీ అయితే పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని చెప్పారు.సమావేశంలో సీఐలు ఇబ్రహీం, రాజారెడ్డి, నారాయణయాదవ్ పాల్గొన్నారు.



సీఐలతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ ఆర్.హారిక

పిల్లలకు చదువు, మంచి నడవడిక నేర్పాలి

జూనియర్ సివిల్ కోర్టు జడ్జి

చాపాడు : తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు, అంతస్తులు ఇవ్వాల్సిన అవసరం లేదని చదువు, మంచి నడవడిక ఇస్తే వారే గొప్పవారవుతారని మైదుకూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.ఖాజా మైనుద్దీన్ అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద శనివారం సాయంత్రం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో పరిస్థితులు ప్రభావాల వల్లే సమస్యలు ఉత్పన్నమవుతాయని ఈ క్రమంలో క్షమించే గుణం ఉంటే సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోలీసుస్టేషన్లు, కోర్టులకు వెళ్లి ఉచిత న్యాయం పొందవచ్చన్నారు. ఫిబ్రవరి 11న మైదుకూరు కోర్టు వద్ద జాతీయ లోక్ అదాలత్ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో రాజీ మార్గమే రాజమార్గంగా కేసులు పెట్టుకున్న వారు రాజీ అయితే వాటిని కొట్టి వేయడం జరుగుతుందన్నారు. ఏవైనా వస్తువులు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు. వాటి ద్వారా ఎలాంటి నష్టం వాటిల్లినా నష్ట పరిహారం పొందవచ్చన్నారు. అనంతరం పలువురు న్యాయ వాదులు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కేసీ రాజు, న్యాయ వాదులు జీపీ జ్వాలా నరసింహశర్మ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు రవిశంకర్, జేకే చారీ, రవి, ఏఎస్ఐ శంకరయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఖాజా మైనుద్దీన్

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు వి.జయప్రకాశ్

ప్రొద్దుటూరు : టెన్త్‌లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు వి.జయప్రకాశ్ తెలిపారు. ప్రొద్దుటూరు బాలికల కళాశాల వసతి గృహంలో శనివారం ప్రొద్దుటూరు, కమలాపురం ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోని వసతి గృహాల పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం చదివితే విజయం సాధించవచ్చని తెలిపారు. విషయ నిపుణులు నాగేశ్వరరావు, ఇంగ్లిషులో ఎం.హృషికేశవ ఆచారి, సైన్స్‌లో బి.చంద్రమోహన్, గణితంలో సంజీవరెడ్డి, హిందీలో కె.బాలరాజు పరీక్షల్లో మంచి మార్కులు ఎలా సాధించాలో మెలకువలు వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు బి.గురుప్రసాద్, టి.స్వర్ణలత, వసతి గృహ సంక్షేమ అధికారులు ఎ.రామకృష్ణారెడ్డి, ఎం.బ్రహ్మం, బి.నాగరాజునాయక్, ఎస్ఎం బషీర్, వి.నాగరాజు, సి.గురుజ్యోతి, బి.శివలక్ష్మి, ఎస్.వహీదా బేగం, ఎల్.నరసారెడ్డి, డి.రాజగోపాల్‌రెడ్డి, బుజ్జమ్మ, ఎల్.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.జయప్రకాశ్

కషాయాలను వినియోగించుకోండి

మైదుకూరు : ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతులు ఆర్బీకేలలో ఉన్న కషాయాలను వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న తెలిపారు. మండలంలోని జీవీ సత్రంలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళలకు నాబార్డు సహకారంతో రెండో రోజు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులను తగ్గించుకోవచ్చునన్నారు. సేంద్రీయ ఎరువులను వాడటం వల్ల భూ సారాన్ని పెంచవచ్చని తెలిపారు. వనిపెంట కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త కాంతిశ్రీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు పంటల సాగులో చైతన్యవంతులుగా ఉన్నారన్నారు. వివిధ పంటల సాగులో మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు సూర్యనారాయణరెడ్డి, నాగలక్ష్మి, డీపీసీసీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సీఆర్పీలు బాలయ్య, బాలస్వామిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ లక్ష్మీప్రసన్న

అన్ని రంగాలలో అభివృద్ధి

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బి.కోడూరు : బి.కోడూరు మండలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందని ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రెడ్డివారిపల్లెలో ఈఏపీ గ్రాంట్ కింద మంజూరైన బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.కోడూరు మండలంలో ఆయకట్టు విస్తీర్ణం అభివృద్ధి కోసం లోయర్ సగిలేరు ప్రాజెక్టు ఎడమ కాలువ ఆధునీకరణ, గేట్ల మరమ్మత్తుల కోసం సుమారు రూ.20 కోట్లు నిధులు ఖర్చు చేస్తున్నామని, అలాగే మండలంలో అక్కడక్కడ మిగిలిపోయిన లింకు రోడ్ల నిర్మాణం కోసం రూ.10 కోట్లు నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించామని తెలిపారు. మండల పరిధిలోని పది పంచాయతీల పరిధిలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌క్లినిక్, బల్క్‌మిల్క్ సెంటర్లు పూర్తిస్థాయిలో నిర్మించి అందులో విధులు కూడా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకుని మరింత అభివృద్ధి పథంలో బి.కోడూరు మండలాన్ని నడిపించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ కె.రమణారెడ్డి, జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాష్‌రెడ్డి, పుల్లివీడు సర్పంచ్ రఘునాథరెడ్డి, పోరుమామిళ్ళ ఉప సర్పంచ్‌లు రాళ్ళపల్లిరవి, పోరుమామిళ్ళ ఉప మండలాధ్యక్షుడు సి.బాషా, డీసీ యువసేన అధ్యక్షుడు చాపాటిసాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తాగిరిప్రణీత్‌రెడ్డి, యోగానందరెడ్డి, పిచ్చిరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, రామిరెడ్డి, రవి, పిచ్చిరెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, రామ, భాస్కర్‌రెడ్డి, రాళ్ళపల్లినరసింహులు, అల్లా తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు పనులకు భూమిపూజ

బద్వేలు : పోరుమామిళ్ళ మండలంలోని యరసాల, సిద్దవరం మధ్య నూతన తారురోడ్డు ఏర్పాటుకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శనివారం భూమిపూజ చేశారు. రూ.2.80 కోట్ల నిధులతో ఈ పనులను చేపడుతున్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కె.రమణారెడ్డి, రజాసాహెబ్‌పేట సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రసాద్, వైస్ ఎంపీపీ చెన్నురాజశేఖర్, నాయకులు రవిచంద్రారెడ్డి, హరిచంద్రారెడ్డి, దశరథరామిరెడ్డి, బాలిరెడ్డి, గురివిరెడ్డి, శివరామిరెడ్డి, మాల్యాద్రి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట

బద్వేలు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బద్వేలు నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో జిల్లా కలెక్టర్ డీఎంఎఫ్ నిధుల నుండి మంజూరు చేసిన రూ.60 లక్షల నిధులతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం ఆయన భూమిపూజ చేశారు.



బి.కోడూరు : రెడ్డివారిపల్లెలో రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

రేపటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

బద్వేలు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధ సోమవారం నుండి కాశినాయన మండలంలో ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నరసాపురం పంచాయతీలో కార్యక్రమం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.

నేడు కొత్తపల్లెలో..

ప్రొద్దుటూరు : మండంలోని కొత్తపల్లె పంచాయతీలోని కొత్తపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం 7 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తారని, సమస్యలను అడిగి తెలుసుకుంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అగ్ని ప్రమాదం

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపేటలో రమణయ్య అనే వ్యక్తి ఇంట్లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఫ్రిజ్, బీరువా, దుస్తులతో పాటు ఇల్లు దెబ్బతింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూటే కారణమని ఫైర్ అధికారులు తెలిపారు. ఫైర్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, లీడింగ్ ఫైర్‌మెన్ నారాయణరెడ్డి, డీఓపీ సిద్దయ్య, ఫైర్‌మెన్లు గురయ్య, మల్లికార్జునరెడ్డిలు పాల్గొన్నారు.

మృతదేహానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన ఎట్టి ఈరన్న మృతి చెందాడు. ఆయనకు కొడుకులు లేరు.. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ముందుకు రాలేదు. స్పందించిన వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తల సుబ్బరాయుడు యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్ మాదిగ, మరికొంత మంది ఆర్టీపీపీ రోడ్డులోని శ్మశాన వాటికలో ఈరన్న మృతదేహానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

సమర్థపాలన జగనన్నతోనే సాధ్యం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు : రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా సమర్థంగా నిర్వహించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాత్రమే సాధ్యమవుతుందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్ళ మండలంలోని తిమ్మారెడ్డిపల్లె పంచాయతీ చిన్న కప్పలపల్లె, పెద్ద కప్పలపల్లె, జయనగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. పంచాయతీలో రూ.10 లక్షల సోలార్ పవర్ కార్పొరేషన్ నిధులతో నిర్మించిన తాగునీటి శుద్ధి ప్లాంట్లను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, వైస్ ఎంపీపీ చెన్నురాజశేఖర్, రంగసముద్రం, తిమ్మారెడ్డిపల్లె, టేకూరుపేట సర్పంచ్‌లు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, బీరంఉమ, రమణారెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, బాలుడు, గురప్పడు, ఈఓపీఆర్‌డీ భాస్కర్‌బాబుతో పాటు అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

బద్వేలు అర్బన్ : ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో ఆకులవెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల గౌరవానికి భంగం కలగకుండా ఉన్న చట్టాలు సక్రమంగా అమలయ్యేలా అధికారులు కృషి చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో ఆకులవెంకటరమణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసిన తర్వాత నిర్దేశించిన సమయంలోగా బాధితులను విచారించి వారికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం స్టేషన్ల వారీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులు, వాటి స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్, ఆర్డీవో కార్యాలయ ఏవో సరస్వతి, సీఐలు వెంకటేశ్వర్లు, హనుమంతనాయక్, సురేష్‌రెడ్డి, బి.వి.చలపతి, నరేంద్రరెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్ఐలతో పాటు రాజంపేట డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

రైతులతో మమేకం కావాలి

ఆర్డీఓ ఆకుల వెంకటరమణ

బద్వేలు అర్బన్ : వ్యవసాయాధికారులు, ఆర్బీకే సిబ్బంది రైతులతో మమేకమై వారికి నూతన సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని ఆర్డీవో ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీ అబ్బుసాహెబ్‌పేట గ్రామంలో ఆదర్శ రైతు గోగుల రాధాక్రిష్ణయ్య వ్యవసాయ క్షేత్రంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా గ్రామ వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆదర్శ రైతు గోగుల రాధాక్రిష్ణయ్య సాగు చేసిన 15 రకాల దేశీ వరి సాగును పరిశీలించి రైతును అభినందించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటినాగరాజ, వ్యవసాయాధికారులు చంద్రమోహన్‌రెడ్డి, అరవిందనాయక్, రామకృష్ణయ్య, రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ చిత్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆకుల వెంకటరమణ

జిల్లా స్థాయి చేతిరాత విజేతలకు బహుమతులు

పోరుమామిళ్ల : అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమీ డైరెక్టర్ మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చేతిరాత పోటీల్లో విజేతలకు శనివారం పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహుమతులు అందచేశారు.

సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జనవరి 23న జిల్లా స్థాయి చేతిరాత పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థులకు సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎస్ఏ జిల్లా కోఆర్డినేటర్ దశరధరామిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్, మెమొంటోలు అందచేశారు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గానుగపెంట రమణారెడ్డి, ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చేతిరాత పోటీల్లో విజేత విద్యార్థులతో అధికారులు

ఫేస్ రికగ్నైజ్డ్ యాప్ రద్దు చేయాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు ఫేస్ రికగ్నైజ్డ్ యాప్‌ను రద్దు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏటీయూసీ) నాయకులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకుడు యేసోబ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల్లో 99 శాతం మంది నిరక్షరాస్యులని తెలిపారు. స్మార్ట్ ఫోన్లలో యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని రోజు 4 సార్లు అటెండెన్స్ వేయడం చేతకాదన్నారు. తక్షణమే ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతి పత్రం ఇచ్చారు. యూనియన్ నాయకులు రూబెన్, నిర్మల, ఓబులేసు, చంద్రపాల్, సురేష్, మధు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రమిస్తున్న యూనియన్ నాయకులు